# ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

## - సిఎం చంద్రబాబునాయుడు



కుప్పం, మే 25 ప్రభాతవార్త

ప్రజలు ఎదురొ ్కంటున్న సమస్యలను అధికార యంత్రాంగం త్వరగా పరిష్కరించాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆదివారం శివపురం వద్ద గృహ ప్రవేశ కార్యక్రమంకు హాజరైన ముఖ్యమంత్రికి ప్రజలు వివిధ రూపంలో వినతి పత్రాలు అందించారు. దీనిపై స్పందించిన సిఎం చంద్రబాబునాయుడు ప్రజలనుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరిలను ఆదేశించారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# శక్తిక్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

బోయకొండ(చౌడేపల్లి), మే 25 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో నిండిపోయింది. వేసవి సెలవులు కావడంతో కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యం లో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆలయ అర్చక, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

# పండగ వాతావరణంలో 'నారా'వారి గృహప్రవేశం

## - సొంతింటి శుభకార్యంగా తరలివచ్చిన కుప్పం ప్రజానీకం.. ముప్పైవేలమందికి విందుభోజనాలు !!

## - హాజరైన ఎమ్మెల్సీలు.. ఎమ్మెల్యేలు.. ఉన్నతాధికారులు.. పార్టీ శ్రేణులు !!



శాంతిపురం, మే 25 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సొంతింటి గృహ ప్రవేశ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా పండగ వాతావరణంలో జరిగింది. ఆదివారం వేకువజామున సిఎం చం ద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరి, తనయుడు, రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్, మంత్రి సతీమణి నారా బ్రాహ్మణిలు శివపురం వద్ద నిర్మించిన నూతన ఇంటికి దేవతల ప్రతిమలతో హాజరయ్యారు. అనంతరం నూతన గృహంలో వేదపండితులు పూజాది, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. సిఎం చంద్రబాబు దంపతులు గోపూజ నిర్వహించారు. మంత్రి లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి నూతన ఇంట్లో పాలు పొంగించారు. మధ్యాహ్నం సిఎం చంద్రబాబునాయుడు కుటుంబంతో కలసి భోజనం చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలను పలకరిస్తూ అభివాదం చేశారు. కుప్పం ప్రాంత ప్రజలు, పార్టీ కార్యకర్తల ఆకాంక్ష మేరకు కుప్పంలో సొంత ఇల్లు నిర్మించాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించిన విషయం విదితమే. ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ అయిన ఎల్‌అండ్‌టి సంస్థ వారు కుప్పంలో సిఎం సొంత ఇంటిని ఆహ్లాదకర వాతావరణంలో అందర్నీ ఆకట్టుకునేలా నిర్మించారు.

**హాజరైన ఎమ్మెల్సీ.. ఎం.పి...ఎమ్మెల్యేలు :**

సిఎం చంద్రబాబునాయుడు గృహ ప్రవేశ కార్యక్రమంకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు ,నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, చుడా ఛైర్మన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, కార్పోరేషన్ ఛైర్మన్ శ్రీదేవి,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రికి ఈసందర్భంగా జ్ఞాపికలు అందించారు. అలాగే జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి,అనంతపురం రేంజ్ డిఐజి షిమోషీ, జిల్లా ఎస్పీ మణికంఠ చ ందోలు, డిఎఫ్ఓ భరణి తదితరులు విచ్చేశారు. మరో పక్క కుప్పం నియోజకవర్గం నుంచే కాక జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి సిఎం గృహ ప్రవేశ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు.

**ముప్పైవేలమందికి విందు భోజనాలు :**

సిఎం చంద్రబాబునాయుడు గృహ ప్రవేశానికి హాజరైన ప్రముఖులు, ప్రజలకు సిఎం చంద్రబాబునాయుడు, సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, మంత్రి సతీమణి నారా బ్రాహ్మణిలు చక్కటి విందు భోజనాన్ని ఏర్పాటుచేయించారు. ఉదయం 10.30గంటలనుంచే హాజరైన వారికి భోజనాల వడ్డింపు కార్యక్రమం ప్రారంభించారు. దాదాపు ముప్పై వేలమందికి సిఎం కుటుంబీకులు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంకు హాజరైన ప్రజలు సైతం తమకు వడ్డించిన ఆహారంపై ఎంతో సంతృప్తి వ్యక ్తం చేశారు. ఆదివారం పండగ వాతావరణంలో సిఎం చంద్రబాబునాయుడు సొంతింటి గృహ ప్రవేశం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, శాంతిపురం టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపిపి ఉదయ్‌కుమార్, మాజీ పిహెచ్‌సి ఛైర్మన్ వెంకటాద్రినాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకు గణనాధుని ప్రసాదాలు అందజేత

కాణిపాకం, మే 25 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం తరపున ఆదివారం స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం శివపురం వద్ద సీఎం చంద్రబాబునాయుడు నూతనంగా నిర్మించుకున్న ఇంటికి ఆదివారం గృహప్రవేశం చేశారు. ఈసందర్భంగా శివపురం విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడుకు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి ప్రసాదాలను,శేషవస్త్రాలను, చిత్రపటాన్ని, వేదపండితుల ఆశీర్వచనంను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ( పధాన అర్చకులు సోశేఖర్ గురుకుల్, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, కాణిపాకం ఆలయ సీఎఫ్ఓ నాగేశ్వరరావు, అర్చకులు, వేదపడింతులు పాల్గొన్నారు.



### బయటకు వచ్చిన

# ఆ కార్పొరేటర్లు ఏ పార్టీ!?

## -నేటికీ వైసిపి కార్పోరేటర్లుగానే జనంలో చలామణి !!



ప్రభాతవార్త-తిరుపతి:

నాలుగేళ్ళక్రిందట హంగూ, ఆర్భాటంగా వైసిపి గుర్తుపై తిరుపతి నగర పాలక కౌన్సిల్‌లో కొందరు కార్పొరేటర్లుగా గెలవడం, కొందరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇలా దాదాపు నాలుగు సంవత్సరాలు అన్నీ తామై పెత్తనం చలాయిం చిన కొందరు కార్పొరేటర్లు ఆరునెలల క్రిందట ఆ పార్టీని వీడినా ఇప్పుడు ఏ పార్టీ కార్యకర్తలుగా ఉన్నారనేది తిరుపతి జనంలో అయోమయంగా మారింది. 2021 మేనెల నుండి 2024 నవంబర్ నెలవరకు దాదాపు 47మంది కార్పొరేటర్లు వైసిపితోనే చట్టపట్టాల్‌వేసుకుని తిరిగారు. ఆయా డివిజన్‌లో గెలిపించిన జనాలకు ఏదో మొహమాటంగా అడపాదడపా కనిపిస్తూ వారిని పలకరించి ఇలా తమసొంత పనులు చక్కబెట్టుకున్నారనేది రాజకీయంగా విమర్శలు కూడా. ఇదే విషయంపై టిడిపి సీనియర్‌నేతలు, కార్యకర్తలు కూడా విశ్లేషణ. 2024 మేనెలలో వైసిపి ఎమ్మెల్యేలు,ఎంపిలు అడ్రస్‌లేకుండా ఓడిపోవడంతో రాష్ట్రంలో అధికారం కోల్పోయింది. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో కూడా 13 అసెంబ్లీ స్థానాలు టిడిపి కైవశం చేసుకుంది. తిరుపతి నియోజకవర్గంలో వైసిపి ఓటమితో ఆ పార్టీకి చెందిన 47మంది కార్పొరేటర్లలో 25మందివరకు కూటమి పార్టీల వైపు చేరికకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అప్పటివరకు వైసిపి ముఖ్యనేతలతో ,వారికి నమ్మిన బంటులుగా వున్న కార్పొరేటర్లు ముద్రనారాయణ(ఉపమేయర్-1), ఎస్‌కెబాబు, శేఖర్‌రెడ్డి, అన్నా అనిత, అన్నా సంధ్యయాదవ్ ,నరసింహాచారి, పరదేశినరేంద్ర, కుడితి సుబ్రమణ్యం, దొడ్డారెడ్డి ప్రవళిక, దొడ్డారెడ్డి ప్రతాప్‌రెడ్డి, రాధ, దూదికుమారి, తిరుత్తణి శైలజఇంకా పలువురు కూటమిపార్టీలతోఉన్నారు. ఈఏడాది ఫిబ్రవరిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఉపమేయర్-2 ఎంపికలోనూ స్వతంత్రులుగా వ్యవహరించిన వైసిపి కార్పొరేటర్లు టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణకు మద్దతుతెలిపి గెలిపించారు. అప్పటినుండి నాలుగునెలలుగా వీరిలో ఎస్‌కె బాబు, కల్పనయాదవ్, రేవతి మరో ముగ్గురు జనసేనపార్టీలో చేరగా మిగిలిన 18మందివరకు వైసిపి కార్పొరేటర్లు ఏ పార్టీలో ఉన్నారనేది తిరుపతి జనంలో అనుమానాలు కలిగిస్తున్నాయి. కొందరు బయటినుండే టిడిపినేతలతో చట్టపట్టాలేసుకుని తిరిగేస్తున్నా కొందరు తమ పాతపార్టీలోనే చలామణిఅవుతూ తమ పనులు చక్కబెట్టుకునేందుకు కూటమిపార్టీల నేతలతో తిరుగుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మరీ వైసిపిలోనే ఉన్నారా?లేక కూటమిపార్టీల్లో ఏ పార్టీలో ఉంటారనేది మాత్రం వారి అంతరాత్మకే అంతుచిక్కని విషయం. సరిగ్గా మరో ఏడాదికాలం వారందరికీ పదవి యోగం ఉన్నా వైసిపి పార్టీలో ఇమడలేక ఒక్కసారిగా ఇతర పార్టీలతో కలిసేందుకు ఉత్సాహం చూపుతున్నా చేర్చుకోలేకపోతున్నారు. దీంతో వైసిపి తరపున కార్పొరేటర్లుగా గెలిపించిన ఆ డివిజన్ జనం అయోమయంలో ఉన్నారు. ప్రస్తుతం మేయర్‌గా కొనసాగుతున్న డాక్టర్ శిరీషను కాదని ఆ పదవిని అదే సామాజిక వర్గానికి కట్టబెట్టాలని కూటమి పార్టీల పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నా ,చివరలో తమకు జనంలో చెడ్డపేరు ఎందుకని ఈ విషయంలో అధిష్టానం నుండి సుముఖత లేకపోవడంతో వీరి భవిష్యత్తు మాత్రం జనంచేతిలో ఉంది.

# వరుస సెలవులతో తిరుమల భక్తజనసంద్రం



తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:

వేసవిసెలువులతో బాటు రెండురోజులు సెలవులు కావడంతో వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తిరుమలకు పోటెత్తారు. భారీగా భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహా రాష్ట్రనుండి తరలిరావడంతో ఆదివారం ఉదయానికి తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. ఆలయం వెలుపల క్యూలైన్లు మూడుకిలోమీటర్లు వరకు చేరాయి. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఎనిమిది గంటలు సమయం కేటాయిస్తున్నారు. గత వారంరోజుల నుండి తిరుమలలో విపరీతంగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 51వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

# నిధులు లేవంటూ.. ఎన్‌టీఆర్ సప్లై ఛానల్‌పై నిర్లక్ష్యం...

## తుప్పు పట్టిన షట్టర్లు గేట్లు.. కొట్టుకుపోయిన కాలువ గట్లు
## నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న అధికారులు

పాకాల, మే 25, ప్రభాతవార్త

పాకాల మండలంలోకి ప్రవహించే ఎన్‌టీఆర్ లింక్ కెనాల్ ప్రస్తుత పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. దామల చెరువు పెద్ద వంక నుంచి ఎన్టీఆర్ సప్లై ఛానల్ ద్వారా పాకాల చెరువుకి గొలుసు కట్టు కాలువ ద్వారా దాదాపు పది చెరువులకు నీరును అందించాలనే ఉద్దేశంతో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఎన్టీఆర్ సప్లై ఛానల్ పై ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించకపోవడం బాధాకరమని ప్రజలు తమ ఆవేదాన్ని వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు పత్రికలలో సమస్య గురించి ప్రచురించిన స్పందించని ఇరిగేషన్ అధికారులు పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగు, తాగునీరు ఇచ్చే క్రమంలో నాలుగు దశాబ్దాల ముందు నిర్మించిన ఈ సప్లై ఛానల్ ఎక్కడికి అక్కడ పూడిపోయి పిచ్చి మొక్కలు పెరిగిపోయి, నీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారి దామలచెరువు పెద్ద వంకలో వర్షా కాలంలో నీటి ప్రవాహం మెండుగా ఉన్నప్పటికీ, కాలువలో నీటిని చెరువులకు తరలించే విషయంలో అధికారుల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కాలువ పనులలో ఆలస్యమయ్యే కొద్దీ అంచనా వ్యయం పెరిగి మరింత భారం అవుతుంది. ఇప్పటికే నీరు లేక వ్యవసాయం చేయలేక



రైతులు వలస బాట పడుతున్నారు. ఉన్న కొద్ది పొలాన్ని సన్న, చిన్న కారు రైతులు పంటలు వేయలేక పొలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పోయి ఎటు కాకుండా మారుతున్నాయి. లింకు కెనాల్ ఆలస్యం అయ్యే కొద్దీ నిరుద్యోగ సమస్య పెరగడంతో పాటు ఆహార ధాన్యాలకు ఇబ్బందులు ఏర్పడతాయి. ఈ నీటి ద్వారా పాకాల రైల్వే జంక్షన్ మీదుగా తిరుపతి కాట్పాడి, 1332కోట్లు, పాకాల ధర్మవరం 2900 కోట్ల రూపాయలుతో డబ్బింగ్ లైన్ పనులు, మరియు విద్యుదీకరణ కోసం రూ. 239.10 కోట్లతో అభివృద్ధి పనులకు ఊతంగా ఉంటుంది. త్వరలో మొదలు కాబోయే దామల చెరువు రైల్వే మ్యాంగో కారిడార్ అభివృద్ధికి, మండల అభివృద్ధికి ఈ కాలువ తోడ్పడుతుంది. ఈ కాలువ ద్వారా హంద్రీనీవా నీరు లింకు చేసే అవకాశం ఉంది. అధికారులు మొద్దు నిద్ర వీడి వేగంగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

# డిపాజిట్లు చెల్లించి పదేళ్ళైంది: మా ఇళ్ళు మాకివ్వండి!

## టిడ్కో లబ్ధిదారుల మొర
## ఏమి చేయలేమంటున్న అధికారులు



**శ్రీకాళహస్తిలోని నిరుపేదలు,మధ్యతరగతి వారికి గూడు సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో 2014-2019లో అధికారంలో ఉన్న నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు టిడ్కో గృహాలను లబ్దిదారుల భాగస్వామ్యంతో నిర్మించుటకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలను కల్పించారు. శ్రీకాళహస్తిలో లబ్దిదారులను ఎంపిక చేసారు.లబ్దిదారులు రూ.10.44కోట్లు తమ వాటాగా సింగిల్,డబుల్ బెడ్‌రూంల కోసం డి.డిల రూపంలో చెల్లించారు. 2018 నాటికి ఇళ్ళ నిర్మాణం పూర్తి అయ్యిందని కులుకు పద్దతిలో కేటాయించారు. టోకెన్లు జారి చేసారు. ప్రభుత్వం మారింది.ఐదేళ్ళలో టిడ్కో గృహాలకు రంగులు మార్చారు తప్ప లబ్దిదారులకు ఇవ్వక పోగా కొందరు అధికారులు ఇక్కడ కొన్ని ప్లాట్లను దొంగచాటుగా తహశీల్దార్ సహాకారంతో రిజిస్ట్రేషన్ చేసారు.ప్రస్తుతం లబ్దిదారులు ఉన్నవి ఉన్నట్లుగా అప్పగించాలని మొరబెట్టుకుంటున్నారు.**

శ్రీకాళహస్తి,మే 25 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని పేద,మధ్యతరగతి ప్రజలకు సొంత గూడు అవకాశం కోసం టిడ్కో గృహాల పేరుతో ప్రణాళిక రూపొందించారు. వివిధ పరిశీలనల తరువాత లబ్దిదారులను ఎంపిక చేసారు.4064 మంది అర్హులుగా నిర్ణయించారు. వారి నుంచి సింగిల్,డబుల్ బెడ్ రూంలకు లబ్దిదారుల భాగస్వామ్యంతో రూ.10.44కోట్లుడిడి రూపంలో చెల్లించారు. గతంలో ప్రస్తుత మున్సిపల్ మంత్రి నారాయణ మంత్రిగా ఉన్నపుడు టిడ్కో గృహాలను 2018 ఉగాదికి అందిస్తామని తరువాత సంక్రాంతి కి అని ఊరించారు.మంత్రి గోపాలకృష్ణారెడ్డి సారధ్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భారీ సమావేశం ఏర్పాటు చేసారు. ఇళ్ళను కేటాయించుటకు లాటరీ పద్దతిలో నిర్ణయించి టోకెన్లు జారి చేసారు.ప్రభుత్వం మారింది.ఐదేళ్ళ పాటు పరిపాలించిన నాయకులు టిడ్కో గృహాలకు సంబంధించి పట్టించుకోలేదు.పైగా గృహాలు నిర్మించిన నాగార్జున్ కన్‌స్ట్రక్షన్స్‌కు బకాయిలు చెల్లించకపోవటం, రివర్స్ టెండర్ల విధానంతో కంట్రాక్టర్లు ముగించుకున్నారు. టిడ్కో గృహాలు వద్దనుకున్న వారికి జగనన్న కాలనీలో ఇంటి స్థలాలంటూమభ్యపెట్టి కొన్ని గృహాలను తమ అనుచరుల పేర్లను నమోదు చేసుకున్నారు. ఇలా సాగింది.

**జూన్‌లో కొన్నిమున్సిపాలిటిలో ...**

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టిడ్కో గృహాల దుస్థితిని గుర్తించారు. పూర్తి అయిన ఇళ్ళను జూన్‌లో లబ్దిదారులకు అందించుటకు సిద్దం చేస్తున్నారు.అయితే శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 5231 మంది దరఖాస్తు చేసుకోగా 4064 ఇళ్ళను మంజూరు చేసారు. అయితే ఈ ఇళ్ళకు మరి కొన్ని పనులు చేయాల్సి ఉంది. ఇక ఈ కాలనీలో కనీస సదుపాయాలు కల్పించాల్సి ఉంది.ఇక్కడ విద్యుత్ సరఫరా లేదు.రోడ్లు లేదు. మురుగునీటి కాలువల్లేదు.ఇక్కడ లబ్దిదారులకు అప్పగించాలంటే మరో రూ.50కోట్లు నిధులు అవసరం.దాంతో రెండవ దశలో మాత్రమే అవకాశం అని చెబుతున్నారు.

**816 ఇళ్ళు సిద్దం:**

శ్రీకాళహస్తి టిడ్కో ఇళ్ళ పరిస్థితి పరిశీలిస్తే ఇప్పటికి ఇప్పుడు లబిదార్లుకు అందించుటకు 816 ఇళ్ళు సిద్దంగా ఉన్నట్లు సమాచారం.ఇళ్ళను లబ్దిదారులకు బ్యాంకు రుణం కోసం రిజిస్ట్రేషన్ చేసిన వారికి నోటీసులు వచ్చేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి చొరవతో లబ్దిదారులకు బ్యాంకు బాధలను తప్పించారు. బ్యాంకులకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.10కోట్లు చెల్లించారు. ఈగృహాలను పూర్తి చేయటానికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పట్టుదలగా ఉన్నారు.పలు మార్లు మున్సిపల్ మంత్రి నారాయణతో చర్చిస్తున్నారు. లబ్దిదారుల నుంచి వత్తిడి పెరిగిందని ప్రత్యేక నిధులు మంజూరు చేసిన నిరుపేద లబ్దిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. మరి ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

# ఘనంగా తిరంగా ర్యాలీ




తిరుపతి విద్య, మే 25 ప్రభాతవార్త

స్థానిక బాలాజీ కాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు అంగరంగ వైభవంగా దేశ భక్తి ఉట్టి పడినట్లు ఉత్సాహంగా ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం, తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు ముందుగా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి,జెండా ఊపి తిరంగా ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ భారత దేశంలో ఉన్న యువత వారి గుండెనిండా దేశభక్తి నింపుకోవాలన్నారు.దేశ సైనికులు,ప్రధాని మోదీల వల్లే ఆపరేషన్ సింధూరం సక్సెస్ అయ్యిందని ఆయన చెప్పారు.ఉగ్రమూకలను,శత్రు దేశఆగడాలను అరికట్టడంలో సమైక్య ఆలోచనలతో మోదీ తీసుకున్న నిర్ణయాలను సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు మద్దతుగా నిలిచారని ఆయన తెలిపారు.పహల్గాంలో 26 మందిని ఉగ్రవాదులు కాల్చి చంపడంతో దేశమంతా ఒక్కటైందని ఆయన చెప్పారు. పహల్గాం మృతుల్లో ఇద్దరు మన రాష్ట్రానికి చెందిన వారు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఘన నివాళులు అర్పించి బాధిత కుటుంబాలను ఓదార్చారని ఆయన చెప్పారు.పాక్‌తో యుద్ధంలో అమరుడైన శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తో పాటు పవన్ కళ్యాణ్ లు నివాళులు అర్పించి ఆర్థిక సాయం అందించారని ఆయన గుర్తు చేశారు. ఉగ్రవాదులను పూర్తిగా ఏరి వేసేంతవరకు ప్రధాని మోదీ తీసుకుని నిర్ణయాలకు దేశ ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు,సేవా కుటుంబం సభ్యులు సూరా శ్రీదేవి,సరళ, కార్గిల్ యుద్ధవీరులు మాజీ సైనికులు ఎ.పి నాయుడు,అమర రాజ ప్రతినిధి చంద్రబాబు, గుర్రప్ప,మార్పు సేవాసంస్థ దళవాయి గుర్రప్ప,ఉపాధ్యాయులు సాంబి రెడ్డి,బాలాజీ, డాక్టర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు, మే 25 ప్రభాతవార్త:
కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం శివపురం గ్రామంలో ఆదివారం సిఎం నారా చంద్రబాబునాయుడు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు సిఎం చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరీ, మంత్రి నారా లోకేష్‌లను ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి జ్ఞాపికలు అందించి





శుభాకాంక్షలు తెలిపారు. సిఎం గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సికె బాబుసిఎం నారా చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం శివపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన నూతన గృహప్రదేశ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సికె బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సికె బాబు సిఎం నారా చంద్రబాబునాయుడును కలిసి మర్యాద పూర్వకంగా పుష్పగుచ్చం అందజేశారు.

## నేటి పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

చిత్తూరు, మే 25 ప్రభాతవార్త:
జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి నిర్వహించే పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను ఈ సోమవారం రద్దు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు యంత్రాంగం మొత్తం కుప్పం విచ్చేసిన సిఎం నారా చంద్రబాబునాయుడు పర్యటనలో నిమగ్నం కావడంతో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం లేదన్నారు. ప్రజలు ఎవ్వరు సమస్యలు తీసుకుని సోమవారం చిత్తూరు రావద్దని ఎస్పీ కోరారు.

## మంత్రి లోకేష్‌తో సెల్ఫీలకు ఎగబడిన జనం

శాంతిపురం, మే 25 ప్రభాతవార్త
గృహ ప్రవేశ కార్యక్రమం నిమిత్తం కుప్పం పర్యటనకు వచ్చిన సిఎం చంద్రబాబునాయుడు తనయుడు, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలసేందుకు జనం, మహిళలు ఉత్సాహం చూపారు. శనివారం రాత్రి నుంచే మంత్రి లోకేష్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడ్డారు. ప్రజలు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి లోకేష్ వారితో సెల్ఫీలు దిగి వారిలో మరింత ఉత్సాహం నింపారు.

## మాదిగల సంక్షేమానికి కృషి చేస్తా

– మాదిగ కార్పోరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

కుప్పంరూరల్, మే 25 ప్రభాతవార్త



మాదిగల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మాదిగల సంక్షేమానికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర మాదిగ కార్పోరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. ఆదివారం మం దలంలోని బోదగుట్టపల్లి గ్రామంలో ఆమె పర్యటిం చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామా భివృద్ధికి అవసరమైన బిటి, సిసి రోడ్లు, అర్హులకు రేషన్‌కార్డులు, పెన్షన్లు, కార్పోరేషన్ రుణాలు, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ భవనం నిర్మాణం తదితర అంశాలను సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి వాటి మంజూరుకు కృషి చేస్తానన్నారు. డా॥ అంబేద్కర్ విదేశీ విద్య పథకంను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థుల్ని అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, నేతలు వెంకటేష్, వేణు, కుమార్, సతీష్‌కుమార్, గోవిందప్ప, జయప్ప, రాజేష్, నరసింహులు, రాజశేఖర్, పవన్, సురేష్, మంజునాథ్, రవీం ద్ర, పావన , నరసింహులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల మాయాజాలం



పూతలపట్టు, మే 25, ప్రభాతవార్త
పూతలపట్టు మండలంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల బాగోతం రోజురోజుకు దిగజారుతుంది. పని జరగకుండానే పని జరిగినట్టు రికార్డు మైంటైన్ చేయడం, స్థానిక నాయకులకు వత్తాసు పలుకుతూ వారికి తొత్తులుగా మారుతూ చెరువు పూడిక పనులు అయితే నేమి కాలువ పనులు అయితే నేమి కల్వర్టు పనైతే నేమి ఇలా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అనేక పనులు ఉపాధి హామీ కూలీలు లేకుండానే స్థానిక నాయకులకు పనులు కట్ట బెట్టడం జెసిబిలతో పనులు చేయించి రికార్డు మైంటైన్ చేసి నిధులను కొల్లగొట్టి స్థానిక నాయకులు జోబిలో నింపడం ఉపాధి హామీ పథకంలో ఉన్నటువంటి ఫీల్డ్ అసిస్టెంట్ల దిగజారుడుతనానికి నిలువెత్తు రూపముగా పూతలపట్టు మండలం ఉంది. ఉపాధి హామీ పథకంలో కూలీలకు మస్టర్ వేయించడం ఆ మస్టర్‌లో కూడా కూలీలను మోసం చేయడం కూలీల దగ్గర నుండి కమిషన్లు తీసుకోవడం ఘోరమని కడుపు మండుతున్న ఉపాధి హామీ కూలీల ఏడుపులు వర్ణాతీతం కావున పూతలపట్టు మండల అభివృద్ధి అధికారి దీనిపై తక్షణమే స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్ల బాగోతానికి అడ్డుకట్ట వేసి పూతలపట్టు మండల అభివృద్ధి నిధులను స్థానిక నాయకులు జోబిలోకి వెళ్లకుండా కూలీల కడుపు నిండే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో ఉన్నటువంటి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రణాళికా బద్ధంగా యోగా కార్యక్రమం

– జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్



చిత్తూరు రూరల్, మే 25 ప్రభాతవార్త:
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమంను ప్రణాళిక బద్ధంగా న్విహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ మాస్టర్ ట్రైనర్లకు స్పష్టం చేశారు. చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నుండి రెండు రోజుల పాటు జరుగనున్న యోగా మాస్టర్ ట్రైనర్ల శిక్షణా కార్యక్రమంను ఉద్దేశంచి డిఆర్‌ఓ కె.మోహన్‌కుమార్ మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించే ఈ యోగా కార్యక్రమంలో యోగా చేయడం ద్వారా కలిగే ఆరోగ్య లాభాలపై ప్రజలదరికీ వివరించి అవగాహన కల్పించాలన్నారు. మాస్టర్ ట్రైనర్లుగా శిఓణ పొందిన ఫిజికల్ డైరెక్టర్లు, పిఇటిలు, యోగా శిక్షకులు వారి వారి విధులు సక్రమంగా నిర్వర్తించడం ద్వారా యోగాంధ్ర కార్యక్రమంను విజయవంతం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫిజికల్ డైరెక్టర్లు, పిఇటిలు, యోగా శిక్షకులు మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు మండల స్థాయిలో గ్రామాల్లోని వారికి శిక్షణ ఇవ్వాల్సి వుంటుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ శిక్షణా కార్యక్రమంలో యోగాను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. మే 28 నుండి 30వ తేదీ వరకు ఫిజికల్ డైరెక్టర్లు, పిఇటిలు, యోగా శిక్షకులు మండల స్థాయిలో ప్రతి గ్రామం నుండి వచ్చిన మాస్టర్ ట్రైనర్‌లకు శిక్షణ కార్యక్రమం వుంటుందనాననరు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఓ బాలాజీ, ఆయుష్ మెడికల్ ఆఫీసర్, యోగ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసనాయుడు, జిల్లాలోని ఫిజికల్ డైరెక్టర్లు, పిఇటిలు, శిక్షకులు పాల్గొన్నారు.

## శాఖాహార ర్యాలీ



శ్రీరంగరాజుపురం, మే 25 ప్రభాతవార్త:
ఎస్‌ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్ట గ్రామంలో ఆదివారం మల్లీశ్వరీ రవి గురుజీల ఆధ్వర్యంలో శాఖాహార అవగాహన ర్యాలీ నిర్వహించారు. 108 ప్రపంచ దేశాల్లో శాఖాహార అవగాహన ర్యాలీలను పిరమిడ్ ఫెస్టివల్ సొసైటీ ప్రపంచ శాంతి కోసం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కొత్తపల్లిమిట్ట కూడలిలోని చిత్తూరు–పుత్తూరు రోడ్డుపై ప్లేకార్డులు పిరమిడ్ ఆకారాలను తలపై ధరించి నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఆలోచనా విధానం బాగుంటే అన్ని శుభాలేనని పిరమిడ్ జీవనం వల్ల ఆనందమయం అమృత ఆహారం, మృతం లేని శరీరానికి నాంది పలుకుతుందని గురుజీ పేర్కొన్నారు. శాఖాహారం శరీరానికి హారంగా వుంటుందని, రోగాల గురించి భయపడకుండా బయటపడొచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మల్లీశ్వరీ, సుజాత లింగేష్, శారదా దంపతులు, శ్రీదేవి, కుమార్, నాగరాజపిళ్ళై, సుధాకర్, సూరిరెడ్డి, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు రూరల్, మే 25 ప్రభాతవార్త:



ప్రజా సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలకు సంబంధిత అధికారులందరు విధిగా హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎమ్మెల్యే చొరవతో మంచినీటి సమస్య పరిష్కారం



వెదురుకుప్పం, మే 25 ప్రభాతవార్త :
మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మంచి నీటి సౌకర్యం లేక సుమారు 18 సంవత్సరాలుగా పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జీ మోహన్ మురళి స్థానిక ఎమ్మెల్యే థామస్ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన స్పందించి బోరు వేయించడానికి వెంటనే చర్యలు తీసున్నారు. బోరు వేయగా పుష్కలంగా నీరు రావడంతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పంచాయితీ నీరు వసతి గృహానికి వచ్చేవని, సరిపడ రాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మంచినీటి సమస్య పరిష్కారం కావడంతో హర్షం వ్యక్తం చేశారు.

## విశ్రాంతి ఉపాధ్యాయులు వెంకటస్వామికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే

వెదురుకుప్పం, మే 25 ప్రభాతవార్త :



మండలంలోని తెట్టిగుండ్లపల్లెకు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయులు గురసాల వెంకటస్వామి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం నిర్వహించిన కర్మక్రియలలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించి ఉపాధ్యాయులుగా ఆయన అందించిన సేవలను గుర్తుచే సుకుని కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులు,కుమారుడు గంగాధర నెల్లూరు యూవత అధ్యక్షులు గురసాల కిషన్‌చంద్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జీ మోహన్‌మురళి, నాయకులు గుణశేఖర్‌యాదవ్, మధు, భాస్కర్, నరసింహ యాదవ్, కుమార్, రాజా రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మూడు పదుల తర్వాత ముచ్చటగా కలసిన నేస్తాలు



చౌడేపల్లి, మే 25 ప్రభాతవార్త
పది వరకు చదువుకొని చెల్లా చెదరైన నేస్తాలన్నీ ఒక చోట కలిశాయి...మూడు పదులు దాటిన తర్వాత ఒక్క చోటకు చేరుకొని మనసారా మాట్లాడుకున్న వైనం...హోదా వయసు మరచి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసకొన్నారు... స్థానిక ఉన్నతపాఠశాలలో టెన్త్ చదువుకొన్న పూర్వపు విద్యార్థులు(1991-92) కడియాల శరత్ తోటలో కలసుకున్నారు. పాఠశాలలో చిన్నతనం నందు ఆడిన ఆటలను గుర్తు తెచ్చుకొన్నారు. కుటుంబ నేపధ్యాలు, పిల్లల ఎదుగుదలలను గురించి చర్చించుకొన్నారు. పాఠశాలకు, సమాజానికి చేపట్టబోయే కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేసారు. అనంతరం సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. ఉన్నతపాఠశాల పూర్వపు విద్యార్థులు(1991–92)పాల్గొన్నారు.

## గంగమ్మ సేవలో జిల్లా న్యాయమూర్తి అరుణ సారిక

బోయకొండ(చౌడేపల్లి), మే 25 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను జిల్లా న్యాయమూర్తి అరుణ సారిక దర్శిం చుకొన్నారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబ రం న్యాయమూర్తి కుటుంబాన్ని సాదరంగా ఆహ్వానం పలికి అమ్మ వారి దివ్య దర్శనం గావించారు. అనంతరం మండపంలో వేదాశీర్వాదం, అమ్మవారి మెమొంటో పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. ఎస్ఐ నాగేశ్వర రావు, న్యాయమూర్తి కుమారుడు లోకిత్‌చౌదరి, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయంకృతాపరాధమే వ్యాధులకు మూలం : సుజాత

చౌడేపల్లి, మే 25 ప్రభాతవార్త



స్వయంకృతాపరాధమే వ్యాధులకు మూలమని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణురాలు డాక్టర్ సుజాతా రామచంద్రన్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణంలో సత్సంగ్ ఫౌండేషన్ (ఆరోగ్యం దిసెక్రెడ్ గ్రోవ్) పెద్దకొండామర్రి వారి ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జీవనశైలిలో మార్పు వచ్చిన రోజున రోగాలు దరి చేరవన్నారు. ఒత్తిడులకు దూరంగా వుంటేనే బి.పి, మధుమేహం, గుండె జబ్బులు వంటి వ్యాధులకు దూరంగా వుండవచ్చునన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలు వివరించారు. సర్పంచు శ్రీరామ్ భరత్ వరుణ్, డాక్టర్ నిఖిల, సిబ్బంది నగేష్, స్థానికులు పాల్గొన్నారు.

## 30న శ్రీవీరాంజనేయస్వామి ఆలయ మహాకుంభాభిషేకం

కాణిపాకం, మే 25 ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయయైన శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం జీర్ణోద్ధారణ, అష్టబంధనం, మహాసంప్రోక్షణ(మహా కుంభాభిషేకం) కార్యక్రమం ఈనెల 30న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. సుమారు 1.10 కోట్లు రూపాయల వ్యయ అంచనాలో దాత అమెరికాకు చెందిన ప్రవాసాంధ్రుడు మల్లవరపు అనిల్ రాతి కట్టడంతో నూతన శ్రీవీరాంజనేయస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తికావడంతో ఈనెల 30న మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు కుంభాభిషేక పూజలు ఈనెల 27 నుండి ప్రారంభమవుతాయని తెలిపారు. ఈమేరకు ఈనెల 27 నుండి 29 వరకు మహా కుంభాభిషేకం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించన అనంతరం 30న ఉతయం 7 గంటల నుండి 8 గంటల మధ్య మిథున లగ్నం నందు మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈమహా కుంభాభిషేకం కార్యక్రమంలో భక్తులు, పరిసర గ్రామస్థులు, ఉభయదారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరై స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని ఈయన కోరారు.

# కార్యకర్తల అభీష్టం మేరకు పార్టీ అధ్యక్షుల ఎంపిక

- ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్

శ్రీరంగరాజపురం, మే 25 ప్రభాతవార్త:
తెలుగుదేశం పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకు మండల పార్టీల అధ్యక్షుల ఎంపిక జరుగుతుందని ఇందులో ఎలాంటి సందేహం వుండదని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. ప్రభుత్వ వీప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఆదివారం సాయంత్రం శ్రీరంగరాజపురం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర స్థాయి మహానాడు కడపలో జరుగనుందని, ఈ రాష్ట్ర స్థాయి మహానాడు కార్యక్రమంలో ప్రతి ఒక్క కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని, మహానాడు అనంతరం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు పార్టీ అధ్యక్షుల నియామకం జరుగుతుందని స్పష్టం చేశారు. శ్రీరంగరాజపురం మండల పార్టీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ



పూర్తి చేసి పేరు ఖరారు చేస్తారని భావించి ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. పార్టీ కార్యాలయం పట్టనంతగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరు కావడంతో పార్టీ కార్యాలయం పైకెక్కి ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మహానాడు కార్యక్రమంకు తరలివెళ్ళ డానికి బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో 90 ఎంఎల్ బ్యాచ్‌లు తాను మండల పార్టీ అధ్యక్ష పదవులను లంచాలు తీసుకుని ఎంపిక చేస్తున్నానని ప్రచారం చేస్తున్నారని ఈ ప్రచారాలను ఎవ్వరు నమ్మవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి గంధమనేని రాజశేఖర్‌నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నాయకులు సూరిరెడ్డి, సిద్దయ్యశెట్టి, ఫైనేని మురళీ, నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ముగిసిన రిపబ్లిక్ క్లబ్ సర్వసభ్య సమావేశం

శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త




పట్టణంలోని బాబు అగ్రహారం వీధిలో ఉన్న రిపబ్లిక్‌క్లబ్ సర్వసభ్య సమావేశం అసంపూర్తిగా ముగిసింది. ఆదివారం శ్రీకాళహస్తి రిపబ్లిక్‌క్లబ్ ఆవరణలో 84మంది సభ్యులతో సర్వసభ్య సమా వేశం ఆడిట్ కమిటీ సభ్యులు మరియు నిర్వహణ బాధ్యతలు చూస్తున్న మన్మదరావు, అంజూరు సుధాకర్, చంద్రశేఖర్‌రావుల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి మొదట శాశ్వత సభ్యులైన ఆనందరెడ్డితో ఇటీవల మృతిచెందిన సభ్యులకు రెండు నిమిషాలు మౌనంతో సంతాపం తెలుపుతూ సమావేశాన్ని ప్రారంభించారు. ఆడిట్ కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించిన రోజున పాగాల రామకృష్ణయ్య ఎన్‌డిశివకుమార్‌లు అందించిన బకాయిలు జాబితాను అంజూరు సుధాకర్ చదివి వినిపించారు. అనంతరం అజెండాలోని మొదటి అంశం ప్రకారం ఆడిట్ కమిటీలోని మన్మధరావు జమా ఖర్చులకు మరియు వీరి కాలంలో కూడాబకాయిలు పెట్టిన జాబితాను చదివి సభ్యులకు వినిపించారు. అజెండాలోని తర్వాత అంశాలపై చర్చ ప్రారంభించటకు మునిపటి సభ్యుల వాడి వేడి ఆవేశపూరితమైన ప్రసంగాలతో సమావేశం మరో వారం రోజుల పాటు అంజూరు సుధాకర్ వాయిదా వేశారు. సమావేశానికి హాజరైన సభ్యులంరికీ ధన్యవాలుతో సమావేశం ముగిసింది.

## మూడు విభాగాల్లో యోగా పోటీలు : కమిషనర్

శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త
యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడు విభాగాల్లో ప్రతి రోజు పోటీలను నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బిఎస్.గిరికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పోటీలను మూడు కేటగిరీలుగా విభజించి ప్రతిరోజు పోటీలు నిర్వహించడం జరుగుతుందని జూనియర్ విభాగంలో 10–18 సంవత్సరాలు, యువత 19 నుంచి 35 మరియు సీనియర్ విభాగంలో 35సంవత్సరాలు పైబడిన వారు పోటీలకు మున్సిపల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కమిషనర్ కోరారు. ఇతర వివరాలకు 9849905866 కమిషనర్ నంబర్‌ను సంప్రదించవచ్చని కోరారు.

## వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండండి..తహశీల్దార్



తొట్టంబేడు, మే 25 ప్రభాతవార్త
వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ యు.మధుసూధనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుములు మెరుపులతోకూడిన వర్షంపడుతుందని, అన్ని గ్రామాల ప్రజలకు చేరవేశామని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడినట్లయితే ఎవ్వరు చెట్లకింద ఉండరాదని తెలిపారు. విఆర్‌లు ఎప్పటికప్పుడుఅప్రత్తంగా ఉండాలని కోరారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే 9491077046 నంబర్‌కు ఫోన్ చేయాలని తహశీల్దార్ తెలిపారు.

## ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి..అర్బన్ సిఐ



శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త
పట్టణంలోని రైల్వేస్టేషన్ ముందు ఉన్న ఆటో స్టాండ్‌లో ఉన్న ఆటో డ్రైవర్లకు అర్బన్ సిఐ డి.గోపి అధ్వర్యంలో ఆటో స్టాండ్‌లో ఉన్న ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా సిఐ గోపి మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రముఖ పుణ్యక్షేత్రమని ఇక్కడకు వచ్చే యాత్రీకులతో మర్యాదగా నడుచుకోవాలని డ్రైవర్లకు సూచించారు. ఆటో డ్రైవర్లందరు కూడా తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ప్రతి ఆటో డ్రైవర్ పేరు మరియు చిరునామాలు పోలీసులకు చేర్చాలని ఆదేశించారు. రైలు వచ్చినపుడు ప్లాట్‌ఫాం మీదకు వెళ్లి ప్రయాణీకులను బలవంతంగా వారి యొక్క ఆటోలో ఎక్కించుకుని లాడ్జీల వద్దకు తీసుకువెళ్ళి కమిషన్లకోసం వారిని బెదిరించడం చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దేవాలయానికి వెళ్ళే హడావుడిలో ఆటోలో ప్రయాణీకుల బ్యాగులు, పర్సులు మర్చిపోతారని డ్రైవర్లు వాటిని గుర్తించి పోలీసులకు అందిస్తే ప్రయాణీకులకు చేర్చుతామని సిఐ తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సిఐతో పాటు పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఎన్ని సమస్యలున్నా సమాజంపట్ల నిబద్ధతతో జర్నలిస్టులు పనిచేస్తున్నారు

## ఏపిఎంఎఫ్ సమావేశంలో వక్తలు



**తిరుపతి హెల్త్, మే 25 ప్రభాతవార్త ః**

కత్తికన్నా కలం గొప్పదని, జర్నలిస్టులకు ఎన్ని సమస్యలున్నా సమాజం పట్ల నిబద్ధతతో, వారికున్న అనుభవంతో వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏపిఎంఎఫ్ యూనియన్ వ్యవస్థాపకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఢిల్లీబాబురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీషా, టీటీడీ పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి పాల్గొనగా, విశిష్ట అతిథులుగా బీజేపీ సీనియర్ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ చంద్రగిరి ఇన్‌చార్జి మేడసాని పురుషోత్తం నాయుడు, కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, జోష్ ప్రాపర్టీస్ ఎండీ డాక్టర్ ఈశ్వర్ ప్రకాష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యార్లపల్లి గోపి, ఇండియన్ జర్నలిస్టు యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చెల్లుబోయిన శ్రీనివాసులు, యూనియన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బోళ్ళ సతీష్, రాష్ట్ర సీనియర్ నాయకులు కల్లుపల్లి సురేందర్‌రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్స్ మీడియా సోదరులు, సోదరీమణులు పడుతున్న కష్టాలను దగ్గరగా చూస్తున్నామని, వారికి చేదోడుగా, వాదోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏపీ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీబాబు రెడ్డి మాట్లాడుతూ మీడియా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ఏపీఎంఎఫ్ యూనియన్ పనిచేస్తుందని వివరించారు.

**ఏపీ మీడియా ఫెడరేషన్ తిరుపతి జిల్లా నూతన కమిటీ ః**

అధ్యక్షులుగా శివమూర్తి (రేణిగుంట), కార్యదర్శి తిరుపాల్ (తిరుపతి). ట్రెజరర్ సోమశేఖర్‌రెడ్డి (సత్యవేడు), ఉపాధ్యక్షులుగా పరంధామరెడ్డి (తిరుపతి), జయశంకర్ (తిరుపతి), రామచంద్రయ్య (సత్యవేడు), మనోహర్‌రెడ్డి (తిరుమల),సి.వి ప్రసాద్ (పుత్తూరు), సంయుక్త కార్యదర్శులుగా ముదిగోళం సురేష్ (తిరుపతి), రమేష్ (రేణిగుంట), మునిచంద్రారెడ్డి (తిరుపతి), రమేష్ (రేణిగుంట), కార్యవర్గ సభ్యులుగా మోహన్ (తిరుమల), లోకేష్ (పుత్తూరు), సంజీవ రాజు (తిరుపతి), రజనీకాంత్ (నాయుడుపేట), చంద్రకళారెడ్డి (తిరుపతి), హిమజశ్రీ (తిరుపతి),బాల మురళీ (శ్రీకాళహస్తి), బాలాజీ (నగిరి), బాలసుబ్రమణ్యం (రేణిగుంట), రోషన్ (తిరుపతి), కల్యాణ్ (తిరుచానూరు), సాయికుమార్ (చంద్రగిరి),మద్దాలశేఖర్ (నాయుడుపేట), జయచంద్ర (తిరుపతి), మధు (రేణిగుంట)లను ఎన్నుకున్నారు.

# మాతమ్మ కొలుపుకు లింగేశ్వర్ నగర్ సర్పంచ్ విరాళం

**తిరుపతి రూరల్, మే 25 ప్రభాతవార్త ః**



తిరుపతి రూరల్ లింగేశ్వర్‌నగర్ గ్రామ పంచాయితీ పరిధిలోని బాదూరు వీధిలో కొలువైన మాతమ్మ కొలువుకు సర్పంచ్ ఎం. కోటేశ్వరరావు రూ. 17వేలు విరాళం అందజేశారు. పంచాయితీలో మాతమ్మ కొలుపును ఘనంగా నిర్వహించాలని కోరారు.

# టిడిపి మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

**రామచంద్రాపురం, మే 25 ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మేకల తిరు మల రెడ్డిని ఆదివారం పివి పురం పంచా యతీ తెలుగు తమ్ముళ్ళు ఘనంగా సన్మానిం చారు. మాజీ సర్పంచ్‌గా, సింగిల్ విండో అధ్యక్షు డుగా, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ డైరెక్టర్‌గా, టిడిపి మండల అధ్యక్షుడుగా ప్రజలకు, పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఎంఎల్‌ఏ పులివర్తి నాని సిఫార్స్ మేరకు మరోమారు అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో టిడిపి మండల రైతు విభాగం ప్రధాన కార్యదర్శి నరశింహారెడ్డి, రాయలచెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు త్యాగరాజులు, యూనిట్ కో ఇన్‌చార్జ్ రాజేష్ రెడ్డి, నియోజకవర్గ తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు సుగుణ, గ్రామకమిటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి, బూత్ ఇన్‌చార్జ్ ఎన్.రాజేష్, ఉప సర్పంచ్ ఎన్.పురుషోత్తం ఉమ్మడి ఆధ్వర్యంలో తమ అధ్యక్షుడికి ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు.

# అందమైన గోపురంపై పచ్చని చెట్లు

**శ్రీకాళహస్తి,మే 25 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరునికి కోట్ల మేరకు ఆదాయాలు వస్తున్నాయి. అయితే పరిపాలన అంతా నాలుగుగోపురాల మధ్యకే పరిమిత మౌతుంది. బయట పర్యవేక్షణ కొరవడింది. ఇంజనీరింగ్ విభాగం లో కావాల్సి నంత మంది సిబ్బంది ఉన్నారు.కానీ దేవస్థానం భూములు ఆక్రమణకు గురౌతున్నా పట్టించుకునే దిక్కులేదు. అలాగే గోపురాలు,పరిసరాలనిర్వహణపై దృష్టి సారించటం లేదు. ఈ నేపథ్యంలో గోపురాలపై సాధారణంగా చెట్లు మొలవటం జరుగు తుంది. అయితే మొక్కలోనే తొలగిస్తే ఇబ్బంది ఉండదు.కానీ దేవస్థానం అధికారులు పట్టించుకోరు. బిక్షాల గాలిగోపురంపై ఓ పచ్చని చెట్టు మొలిచింది. అది రోజు రోజుకు పెరుగుతుంది. కానీ ఈ మార్గం గుండానే దేవస్థానం అధికారులు పయనిస్తుంటారు.కానీ వారికి ఆ చెట్టు కనబడదు కారణం దాని పై వారు దృష్టి పెట్టరు కాబట్టి ఈ చెట్టు పెరిగితే విగ్రహాలు భిన్నమౌతాయి. వాటి మరమ్మత్తులకు మళ్ళీ శిల్పి పనుల్లో అనుభవం ఉన్న వారికి అప్పగించాల్సి ఉంటుంది. దేవస్థానం అధికారులు దృష్టి సారించి బిక్షాల గోపురంపై మొలుస్తున్న మెలకను తొలగించాలని కోరుతున్నారు.

# ఘనంగా శాప్ ఛైర్మన్ జన్మదిన వేడుకలు




**తిరుపతి క్రీడ, మే 25, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు జన్మదిన వేడుకలు అభిమానుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. శాప్ ఛైర్మన్‌తోపాటు ఆయన సతీమణి బిందు జన్మదినం కూడా ఒకేరోజు కావడం విశేషం. పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరిగిన పుట్టినరోజు వేడుకలకు అధిక సంఖ్యలో టీఎన్ఎస్ఎఫ్, తెలుగుయువత, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు హాజరై శాప్ ఛైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత శాప్ ఛైర్మన్ దంపతులు ఇరువురికి తిరుపతి నియోజకవర్గ శాసన సభ్యులు అరణి శ్రీనివాసులు, జనసేన టౌన్ ప్రెసిడెంట్ రాజారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాప్ ఛైర్మన్ దంపతులు ఇరువురు కుటుంబ సమేతంగా కరకంబాడి రోడ్డులో వేంచేసియున్న శ్రీ బొంతాలమ్మ అమ్మవారిని, తాతయ్యగుంటలోని శ్రీ గంగమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్ల ఆశీర్వాదం అందుకున్నారు. స్థానిక తిమ్మినాయుడు పాలెంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి శాప్ ఛైర్మన్ కార్యాలయం వరకూ శాప్ ఛైర్మన్ రవినాయుడు ర్యాలీగా నడుచుకుంటూ విచ్చేశారు. శాప్ ఛైర్మన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో 1500 మందికిపైగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ కేకులు తెచ్చి కట్ చేయించారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నర్సింహ యాదవ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండీ రాకేష్, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, ఏపీయూఎఫ్‌డీసీ డైరెక్టర్ ఊకా విజయ్‌కుమార్, మాజీమంత్రివర్యులు పరసా రత్నం, తిరుపతి నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు జేబీ శ్రీనివాస్, బీఎల్ సంజయ్, మాజీ టౌన్ బ్యాంక్ ఛైర్మన్ పులిగోరు మురళీకృష్ణారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, మన్యం శ్రీనివాసులు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రజక కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కరాటే చంద్ర, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, ఎడిఫై ప్రణీత్, ఆశాలత, తదితరులు పాల్గొని శాప్ ఛైర్మన్‌కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# టపాకాయల గోడౌన్లను తనిఖీచేసిన డిస్పీ

**తొట్టంబేడు, మే 25 ప్రభాతవార్త**



టుటౌన్ పరిధిలోని బసవయ్యపాళెం-చెన్నై రోడ్డులో ఉన్న టపాకాయల గోడౌన్లను డిఎస్పీ నరసింహమూర్తి ఆధ్వ ర్యంలో టుటౌన్ సిఐ నాగార్జునరెడ్డిలు సంయు క్తంగా తనిఖీలు చేశారు. ఈమార్గంలో సుమారు 3 నుంచి 4 వర కు టపాకాయల గోడౌన్లు ఉన్నాయి. వీటిని డిఎస్పీ ఆకస్మి కంగా తనిఖీచేశారు. గోడౌన్లకు సంబందించి రికార్డులు సక్రమంగా ఉన్నాయా?లేవా? అని తెలుసుకోవడంతో పాటు దుకాణంలో ఉన్న టపాకాయలు పరిశీ లించారు. బాణాసంచా ఉన్న చోట అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేలా చూడాలని డిఎస్పీ ఆదేశించారు. గోడౌన్లనిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే సీజ్‌చేస్తామని హె చ్చరించారు. ప్రస్తుతంజరుగుతున్న ప్రమాదాలను దృష్టిలోఉంచుకుని తనిఖీలు చేపట్టాలని తెలిపారు.

# మా పొలంపై విద్యుత్ లైన్లు వెళ్ళకూడదని తీసేశారు

## - కంట తడి పెట్టుకున్న రైతు





**విజయపురం, మే 25 ప్రభాతవార్త:**

మా పొలంపై విద్యుత్ లైన్లు వెళ్ళకూడదని పక్కన పొలం రైతు చెప్పడంతో 20 సంవత్సరాలుగా వచ్చే విద్యుత్ లైన్లను ట్రాన్స్‌కో అధికారులు తీసి వేయడంతో మా పొలాలు బీడుగా మారిందని రైతు చంద్రయ్య కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌కు చెందిన చంద్రయ్యకు లక్కరాజు మిట్ట వద్ద 4 ఎకరాల పొలం, 4 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఉంది. చంద్రయ్య పొలానికి పక్కన లక్కరాజు మిట్ట ప్రాంతానికి చెందిన రైతు పొలంలో సౌక చెట్లు పెట్టడంతో వ్యవసాయ విద్యుత్ లైన్లకు రెమ్మలు తగులుతున్నాయని, నేను రెమ్మలు కొట్టనని విద్యుత్ లైన్లు తీసివేయాలని చెప్పడంతో మన అధికారులు లైన్లు తీసేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాకు పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ లైన్లు పునరుద్ధరించాలని బాధితుడు ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పక్కన పొలం ఉన్న రైతు వద్దకు వెళ్లి మాట్లాడి వస్తున్నారే కాని, విద్యుత్ లైన్లు పునరుద్ధరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నన్ను ఇబ్బందులకు గురి చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని, అధికారులు నాకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# సి.ఎం.రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణి

**శ్రీకాళహస్తి,మే 25 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు సంఘటనల్లో ప్రమాదాలకు గురై ఆర్థిక స్థోమత లేకుండా అప్పులుపాలైన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదుకుంటున్నారు. ఆదివారం సుమారు రూ.5లక్షల చెక్కులను ఎంఎల్‌ఏ అదించారు. చెక్కులు అందుకున్న వారిలో ఒకరు ఆనారోగ్యంతో వైద్యసేవలందుకున్న వారు కాగా మరో యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆరు నెలల పాటు చికిత్స పొందారు.ఆదివారం చెక్కులందుకున్న వారిలో షేక్ దస్తగిర్,రేవళ్లరవి, ఏ.శంకర్‌రెడ్డిలకు చెక్కులు అందించారు. ఈ సందర్బంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ నేడు చోటు చేసుకుంటున్న పరిస్థితుల్లో నిరుపేదలు,మధ్య తరగతి ప్రజలు ఆసుపత్రులకు సొమ్ములు చెల్లించుకోలేక తల్లడిల్లుతున్నారన్నారు. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తన నిధి నుంచి ఆదుకుంటున్నారన్నారు. ఆపదలో ఉన్న వారికి మంచిమనసుతో చంద్రన్న తన చల్లని చూపు ప్రసాదిస్తున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమాల్లో బాధితులతో పాటు తెలుగుదేశం నాయకులు ఢిల్లీబాబు పాల్గొన్నారు.

# బండారుపల్లిలో ఉచిత వైద్యశిబిరం: విశేష స్పందన

**శ్రీకాళహస్తిరూరల్,మే 25 ప్రభాతవార్త**




ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో ఆదివారం ఎంజిఎం ఆసుపత్రి సారథ్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. రెడ్‌క్రాస్,ఎంజిఎంలు సంయుక్తంగా నిర్వహించిన వైద్యశిబిరానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. వైద్యశిబిరాన్ని ప్రారంబించిన ఎంజిఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి చుట్టుపక్కల గ్రామాల్లో ఆరోగ్య దృష్ట్యా ఎంజిఎంలో 24గంటల వైద్యసదుపాయాలు అందిస్తున్నట్లు వివరించారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించుటకు తన తండ్రి మల్లికార్జున్ నాయుడు ఎంజిఎం ఆసుపత్రిని మరే కార్పొరేట్ ఆసుపత్రుల్లో లేని సదుపాయాలతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. బండారుపల్లిలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. తాము ఊహించని రీతిలో బండారుపల్లి పరిసరాల్లోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు.వైద్యశిబిరంలో గుండెవైద్య నిపుణులు డాక్టర్ వివేక్‌చైతన్య, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ ఉమామహేశ్వరరావు గైనిక్ సమస్యలకు సంబందించి డాక్టరన లక్ష్మీ ప్రసన్న,డెంటల్ డాక్టర్ అర్చన ఆసుపత్రి సిబ్బంది,రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కొండుగారి కృష్ణకుమార్ వారి సహచరులు సహకరించారు.

# మాజీ ధర్మకర్తల మండలి సభ్యునికి నివాళులు



## పార్టీలతో ప్రమేయం లేకుండా . . .

**శ్రీకాళహస్తిరూరల్,మే 25 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు అమ్మపాళెం సర్పంచ్ కందాటి వెంకటరాఘవ రెడ్డి హఠాన్మరణం చెందారు.ఆయన మృతికి రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా నివాళులర్పించారు.సర్పంచ్‌గా రాఘవ రెడ్డి గ్రామాన్ని అభివృద్ధి చేసారు.అలాగే మాజీ ఎంఎల్‌ఏ ఎస్‌సివి నాయుడుతో సన్నిహితంగా ఉండటంతో ఆయనకు శ్రీకాళహస్తీశ్వరుని సేవ చేసే భాగ్యం కల్గింది. ఆలయానికి పరిమిత ఆదాయాలున్న తరుణంలో చక్కటి సలహాలు ఇచ్చే వారు.ఆదివారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆయన అనుచరులు మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు ఆయన అనుచరులతో నివాళులర్పించారు. మరో మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహచరులు హాజరై నివాళులర్పించారు.

# పాతవీరాపురంలో తిరునాళ్ళు సంబరం

**శ్రీకాళహస్తిరూరల్,మే 25 ప్రభాతవార్త**



ఏర్పేడు మండలం పాతవీరాపురంలో తిరునాళ్ళు సంబరాలు చోటు చేసుకున్నాయి. ఆదివారం శ్రీ కృష్ణ ద్రౌపదీసమేత ధర్మరాజుల స్వామి 51వ వార్షికోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. గ్రామ పెద్దలు,నాయకులు పాల్గొని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాల్లో పాతవీరాపురం సర్పంచ్ మంజుల మాజీ జడ్‌పిటిసి మునిరంగారెడ్డి,ఎంపిపి మునిరత్నం రెడ్డి, ఆలయ కమిటి ఛైర్మెన్ కొంగరకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు కే.మనోహర్‌రెడ్డి,పి.బలరాంరెడ్డి,,కే.భూలక్ష్మీ,గంగమ్మ, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వర్లరామయ్యను కలసిన టిడిపి నేతలు

**తిరుపతి,మే 25ప్రభాతవార్త:**



టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యుడు, పార్టీ సంస్థాగత ఎన్నికల ఛైర్మన్ వర్లరామయ్య ఆదివారం సాయంత్రం తిరుపతికి వచ్చారు. ఆయనను తిరుపతి నేతలు సుగుణమ్మ, సూరాసుదాకర్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, వట్టికుంట చిన్నబాబు, బిజి కృష్ణయాదవ్, జయ రాంరెడ్డి, వాలముని, మునిశేఖర్‌రాయల్, నాగరాజు, రేవతి,సుజాతమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో సన్మానించారు.

# సిద్ధ వైద్య శిబిరానికి విశేష స్పందన

**తిరుపతి హెల్త్, మే 25 ప్రభాతవార్త ః**



తిరుపతి ఆర్యవైశ్య అధికారులు, నిపుణుల సంఘం (ఏవీఓపీఏ) సహకారంతో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ జీవన్ కుమార్ ఆధ్వర్యంలో తిరుపతిలోని సిద్ధ క్లినికల్ రీసెర్చ్ యూనిట్ ఆర్ఎస్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరానికి సిద్ధ వైద్యులు డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి, రీసెర్చ్ అసోసియేట్ (ఎస్) డాక్టర్ కె. అరుణాచలం, రీసెర్చ్ అసోసియేట్ (ఎస్) నాయకత్వం వహించగా ఏవీఓపీఏ నిర్వాహకులు, సిద్ధ క్లినికల్ రీసెర్చ్ యూనిట్ యొక్క అంకిత భావం, సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతం జరిగింది. ఈ సందర్భంగా 120 మంది వ్యక్తులకు గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, థైరాయిడ్, షుగర్, ఇతరత్రా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పీఎస్ జీవన్‌కుమార్‌తో పాటు నేతలు ఎంఎన్ శివకుమార్, ఎన్.రామ్ శేఖర్, కమిటీ ఈసీ మెంబర్లు, స్థానిక ప్రజలు, డాక్టర్లు, స్టాఫ్ నర్స్ ఎస్. భాను, తదితరులు పాల్గొన్నారు.

# రవినాయుడుకు శంకర్ యాదవ్ ఘన సన్మానం

**తిరుపతి కలెక్టరేట్, మే 25 ప్రభాతవార్త ః**



శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పుట్టిన రోజు సందర్భాన్ని పురస్కరించు కుని ఆదివారం రవినాయుడు కార్యాలయం లో ఆదివారం టీడీపీ సీనియర్ నేత, అఖిల భారత యాదవ మహా సభ యువజన రాష్ట్ర అధ్యక్షులు శంకర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవి నాయుడుని శాలువ, పుష్పగుచ్ఛాలతో శంకర్ యాదవ్ ఘనంగా సత్కరించి అభినందించారు. మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని శంకర్ యాదవ్ రవి నాయుడును అభినందించారు.

# తిరుపతి డివిజన్

# ప్రజల ఆశీస్సులతోనే దేశం సత్తాచాటాం

## మన్‌కీబాత్‌లో ప్రదాని మోదీ



**తిరుపతి(రవాణ),మే 25ప్రభాతవార్త**

దేశప్రజలందరి ఆశీస్సులతోనే మన సత్తా చాటగలిగామని, కష్టకాలంలో 140 కోట్లమంది ప్రజల పూజలు, ఆశీస్సులు ఫలించి అన్నిటా విజయం సాధించామని అన్నారు. ఆదివారం మన్‌కీబీత్‌లో ప్రజలతో మమేకమైన ప్రదాని మోదీ కార్యక్రమాన్ని తిరుపతిజిల్లాలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు దీపక్‌యాదవ్, తొండమనాటి సుబ్రమ ణ్యంరెడ్డి,గురుప్రసాద్,రాజశేఖర్‌రెడ్డి,చంగల్‌రాయలు.కల్యాణి, మురళి, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# టిడిపి కార్యకర్త మృతికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి

**నారాయణవనం, మే 25 ప్రభాతవార్త**



మండలంలోని కశింమిట్ట పంచాయతీ దళితవాడకు చెందిన టిడిపి కార్యకర్త నగరి.గిరిబాబు(49) అనారోగ్యంతో ఆదివారం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పి ంచారు. వారం రోజులుగా తిరుపతిలోని వెంకటరమణ, స్విమ్స్ ఆస్పత్రిలో గుండెకు సంబం దించి చికిత్స పొందినప్పటికి ఫలితం లేకుండా పోయిందని అతని భార్య, ఇద్దరు కుమారులు భోరున విలపించారు. నిరుపేద కుటుంబ అయిన సుమారు 7లక్షల రూపాయాలకు అప్పులు చేసి చికిత్స అందిం చామన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వపరంగా తప్పక ఆదుకోవడానికి సహకరిస్తానన్నారు. ఆయనతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా సాగుతున్న పాలమంగళం ఉత్తరపుకండ్రిగ గంగ జాతర



**నారాయణవనం, మే 24 ప్రభాతవార్త :**

మండలంలోని పాలమంగళం ఉత్తరపు కండ్రిగలో రౌద్రూతి అంకమ్మ అమ్మవారు, గంగజాతర వేడుకలకు సంబందించి జాతర చాటింపు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విదు య్ుత్ దీపాలంకరణ, అరిటి, మామిడి ఆకులతో ఘనంగా అలంకరించారు.

# జూన్ 7 నుంచి ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

**వడమాలపేట, మే 25 ప్రభాతవార్త:**

అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో జూన్ 7 నుంచి 15వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 6న శుక్రవారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించనున్నారు. 7న శనివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, 8న చిన్నశేష, హంస వాహనాలు, 9న సింహ, ముత్యపు పందిరి వాహనాలు, 10న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 11న మోహినీ అవతారోత్సవం, రాత్రి శ్రీవారి గరుడోత్సవం, 12న హనుమంత, గజ వాహనం, 13న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనం, 14న శనివారం ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం, 15న ఆదివారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు ఉదయం 8 నుంచి 9 గంటలు, రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య నిర్వహిస్తారని తెలిపారు. 10వ తేదీ మంగళవారం సాయం త్రం 4.30 గంటల నుంచి 2 గంటల పాటు నిర్వహించే శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన దంపతులు రూ.500లు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చని టీటీడీ అధికారులు తెలిపారు.

# మహానాడు ఏర్పాట్లలో సత్యవేడు పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు



**సత్యవేడు, మే 25 ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమానికి కడప జిల్లా వేదిక కాగా, ఈ నెల 27,28,29 తేదీల్లో మూడు రోజుల పాటు వేడుక ఘన వైభవోపే తంగా జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ రాంగోపాల్, మద్దిపట్ల సూర్యప్రకాష్, బ్రహ్మం చౌదరి, మంతెన వెంకట సత్యనారాయణ రాజు, తదితర టీడీపీ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్బంగా చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమానికి పార్టీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాది సంఖ్యలో తరలిరానున్న తరుణంలో అందుకు తగినట్లుగా ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు.

# సూపర్ సిక్స్ అమలు చేయండి

**భాకరాపేట, మే 25, ప్రభాతవార్త:**



కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్న ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు ఇంకెన్నాళ్లు అని ప్రజలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని చిన్నగొట్టిగల్లు మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన పేర్కొన్నారు. భాకరాపేట పార్టీ కార్యాలయంలో ఆదివారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఉచిత గ్యాస్ కనెక్షన్, పింఛను మినహా మిగిలిన వాటి అమలకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ. 20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏడాది గడిచి పోయింది, రబీ ముమ్మరంగా సాగుతోంది. పెట్టుబడి సాయం మాత్రం అందలేదన్నారు.

# ధనంజయ యాదవ్‌ని పరామర్శించిన చినబాబు

**విజయపురం, మే 25 ప్రభాతవార్త:**



రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార చుక్క ధనంజయయాదవ్ ఆరోగ్యం బాగ లేక చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొంది పుత్తూరు లో వారి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుం టున్నారు. ఈ విషయం తెలుసుకున్న చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు ఆదివారం వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు పార్టీ పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు భాస్కర్, లోకేష్, దాము, సతీష్, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేచే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**విజయపురం, మే 25 ప్రభాతవార్త:**

నియోజకవర్గంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పంపిణీ చేశారు. ఇందులో భాగంగా నగరి మున్సిపాలిటీ చింతలపట్టెడకు చెందిన ఏ.ఎస్. సెల్వంకు రూ.లక్షా 62 వేలు, ఆర్.డి.లోకనాథన్‌కు రూ.13,500లు, ఏ.డి.ఇంద్రాణికి రూ.15 వేలు, ఏకాంబరకుప్పంకు చెందిన ఎస్.బి.పిల్లి రాణికి రూ.1,00,204లు, వడమాలపేట మండలం వడమాలకు చెందిన కె.విజయశేఖర్‌కు రూ.20 వేల 914, విజయపురం మండలం సీఎన్ కండ్రిగకు చెందిన ఆనంద నాయుడుకు రూ.లక్షా 56 వేల 346 చెక్కులను పంపిణీ చేశారు.

# జనసేన సభ్యత్వ కిట్లు పంపిణి



**శ్రీకాళహస్తిరూరల్,మే 25 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మండలం తిరుమంజనం వారి కండ్రిగ అనే బూరగమానుకండ్రిగలో జనసేన పార్టీ ఆదేశాల మేరకు మండల నాయకులు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లును ఆదివారం పంపిణి చేసారు. బూరగమానుకండ్రిగతో పాటు బృందమ్మ కాలనీలో కూడా జనసైనికులకు అందజేసారు. ఈకార్యక్ర మాల్లో మండల నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజివి, దినేస్, వెంకటరమణ యాదవ్, మణీ,శీను, రవి,ముని, చంద్ర, సాయి,ఈశ్వరయ్య, గంగయ్య,శంకర్ తదితరులుపాల్గొన్నారు.

# మహానాడుకు భారీగా జన సమీకరణ : ఎమ్మెల్యే



వెంకటగిరి, మే 25 ప్రభాతవార్త: కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడుకు నియోజక వర్గం నుండి భారీగా జన సమీకరణ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో మహానాడుకు జన సమీకరణపై నియోజకవర్గ స్థాయి నాయకులతో కూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు జెన్ని రమణయ్యలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం నుండి 5000 మందిని మహానాడు తీసుకొని వెళుతున్నట్లు తెలిపారు. కనివిని ఎరుగని రీతిలో మహానాడును నిర్వహిస్తు న్నట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గం నుండి మహానాడుకు ప్రత్యేకంగా బస్సులను పంపుతున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లో మహానాడు గొప్పగా నిర్వహిస్తారని తెలిపారు. కూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ జిల్లాల నుండి మహానాడుకు భారీగా జన సమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గం నుండి 6000 మందిపైగా వస్తారని చెప్పారు. హిందూపురం ఎమ్మెల్యే సినీ నటులు నందమూరి బాలకృష్ణ ఇతర దేశాల్లో సినిమా షూటింగ్లో ఉన్నందున మహానాడుకు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారు. ఆయన ఉంటే ఇంకా మహానాడుకు ఊపు వస్తుందని తెలిపారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ ఉంటారని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పూర్తిగా పతనం అయిపోయిందని తెలిపారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నన్ను అరెస్టు చేస్తారని చెప్పుకుంటు న్నారని ఆయనను ఎవరు అరెస్టు చేయరని తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య మాట్లాడుతూ మహానాడుకు భారీగా జన సమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నియోజకవర్గాల నుండి ఎమ్మెల్యేలు జన సమీకరణ కోసం రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గం నుండి భారీగా జన సమీకరణ జరుగుతున్నట్లు చెప్పారు. సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## కరాటిలో వెంకటలాస్యకు ఉత్తమ పురస్కారం



కోట,మే 25 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని శ్రీ విద్యావికాస్‌లో ఇంగ్లీమీడియం స్కూల్‌లో ఐదోవతరగతి చదువుతున్న ముప్పవరపు వెంకటలాస్యకు కరాటి పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పురసాకరం దక్కింది. ఆమేరకు ఆదివారం గుంటూరులో ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి కరాటి పోటీలను విక్టోరియా షార్ట్కట్ కరాటి అసోసియేషన్ దూ ఇండియా వారు నిర్వహించారు. కట్ ఈవింట్ నందు ఆంధ్రప్రదేశ్ స్థాయిలో మూడు ర్యాంకు సాధించింది,ఆమేరకు మంగళగిరి ఎస్.పి బల్లి రవిచంద్ర చేతుల మీదగా వెంకటలాస్య ప్రశంసా పత్రం మెడల్ ను అందుకున్నారు.

## శివయ్యసేవలో గాయని స్మిత



శ్రీకాళహస్తి,మే 25 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తులు కిట కిటలాడారు. ఈ నేపథ్యంలో సినీ గాయని స్మిత కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆమెకు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు.ఆమె ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజల్ని జరిపించుకోవాలని కోరారు. ఆలయాధికారులు ప్రత్యేక రాహుకేతుదోష నివారణ టిక్కెట్లు కొని సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద పూజలు జరిపించారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆమెను చూడటానికి భక్తులు ఎగబడ్డారు.

## అంతా శుభం కలగాలి

### -నారాభువనేశ్వరికి పుష్పావతియాదవ్ ఆత్మీయ పలకరింపు



తిరుపతి,మే 25ప్రభాతవార్త: సొంత నియోజక వర్గం కుప్పం శాంతిపురంమండలం శివపురంలో సిఎంచంద్రబాబునాయుడు, ఆయనసతీమణి నారా భువనేశ్వరి నూతనంగా నిర్మించిన ఇంటి గృహప్రవేశం జరిగింది. ఆదివారం ఈ కార్యక్రమానికి రాష్ట్రపార్టీ కార్యదర్శి వి.పుష్పావతి యాదవ్ హాజరై భువనేశ్వరిని ఆత్మీయంగా సన్మానించారు.

## ప్రజలను మోసం చేస్తే చర్యలు తప్పవు

కోట,మే 25 ప్రభాతవార్త: ప్రజలను వ్యాపారస్తులు ఎవరైనా మోసం చేస్తే అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని లీగల్ మెట్రాలజీ ఇన్‌పెక్టర్ మలీశ్వర్ చెప్పారు. ఆయన ఆదివారం కోట,విద్యానగర్‌ల్లో చేపలు, చికెన్, మాట్కన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ ఎయింగ్ మిషన్లు,(కాటాలను) పరిశీలించారు.ఏమాత్రం తేడాలు కనిపించిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## 38 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్దులు కలియక



కోట,మే 25 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని 1986-87 ఎన్‌బీకేఆర్‌లో బిఇడి కోర్సును పూర్తి చేసిన విద్యార్దులు ఆదివారం విద్యానగర్‌లోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆత్మీయ సమావేశంలో సందడి చేశారు. ఆహ్లాదకర వాతావరణంలో అందరు ఉత్సాహంగా గడిపారు.ఆనాటి బిఇడి కళాశాల ప్రిన్సిపల్ నేదురుమల్లి శ్రీధర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత సైదారాబాద్ సిపి సంజీయ్ కుమార్, డిప్యూటి డిఇఒ ప్రభాకర్‌రాజు విశ్రాంతి తహీశీల్దార్, శ్రీహరి, మంద శ్రీనివాసులురెడ్డి, శివకుమార్ తదిరులు పాల్గొన్నారు. వేదికపై వచ్చి ప్రస్తుతం ఏ వృత్తిలో ఎక్కడెక్కడ స్థిరపడ్డారు అనే విషయాలను చర్చించుకున్నారు. కుటుంభ సభ్యులు ప్రస్తుతం ఏమి చేస్తున్నారా వారి వివరాలను తెలిపారు.38 ఏళ్ల తరువాత అంతా ఒకే చోట చదిన బిఇడి కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ ఆనాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ వలనే నేడు రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాల్లో ఉన్నామని వారు గుర్తు చేసుకున్నారు.ఎన్‌బీకేర్ బిఇడి కళాశాల అంటేనే ఆరోజుల్లో ఎంతో గొప్పగా ఉండేదిని పేర్కొన్నారు.వారు ఉంటున్న వృతిని గురించి తెలిపారు.

## అపూర్వ విద్యార్దుల ఆత్మీయ సమ్మేళనం



కోట, మే 25 ప్రభాతవార్త : మండలం చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదో తరగతి చదివిన 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్దుల ఆత్మీయ సమ్మేళన ఆదివారం జరిగింది. విద్యార్దులంతా చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ముందుగా ఆనాటి హెచ్ఎం సంపత్‌రెడ్డిని,ఏలియా, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్, రమణయ్యలను పూలమాలతో సన్మానించారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్దులంతా ఒక్క చోట చేరారు వారి చిన్న నాటి జ్ఞాకాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమం కుంబాల బాబు ఆధ్వర్యంలో జరిగింది. వేదికపైకి ఒక్కొక్కరగా వచ్చి పరిచయం చేసుకుని కుటుంభ సభ్యుల వివరాలు తెలిపారు. పలువురు విద్యార్దులు మాట్లాడుతూ ఆనాడు ఇక్కడ గురువులు తమకు నేర్పిన విద్య వలనే నేడు తామంతా ఉన్నత స్దానంలో ఉన్నామని పేర్కొన్నారు. ఆనాడు తరగతి గదిలో వారు చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఆరోజు కష్టపడి చదువుకున్నాము అందవల్లే నేడు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నామని తెలిపారు. మరి కొంత మంది వ్యాపార రంగంలో స్థిర పద్దారు. ఈ కార్యక్రమంలో కుంబాల బాబు ఎం.శేషయ్య, హైమవతి,ఎస్‌కె, ఖాదర్, మునిహరి,తదితరులు పాల్గొన్నారు. అనంతరం అందరు కలిసి సామూహిక భోజనాలు చేశారు.

## ఏమయ్యా కిషోర్...ఎలా ఉన్నావు!



చిట్టమూరు. మే 25 ప్రభాతవార్త: కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతనంగా నిర్మించిన గృహప్రవేశ కార్యక్రమంలో చిట్టమూరు మండల కన్వీనర్, గణపర్తి వంశస్తుల యువ ఆశా కిరణం గణపర్తి కిషోర్ నాయుడు పాల్గొన్నారు. ఎన్టీఆర్ హయాము నుండి నేటి చంద్రబాబు హయం వరకు వారి కుటుంబ సభ్యులతో గణపర్తి కుటుంబానికి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కిషోర్ నాయుడుకు గృహప్రవేశానికి ఆహ్వానం అందడంతో ఆయన కుప్పంకు వెళ్లి పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పార్టీలో కొనసాగుతూ చిట్టమూరు మండల పార్టీ అభివృద్ధికి కిషోర్ నాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారు. గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్‌కు నమ్మిన బంటుగా ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ కుటుంబ సభ్యులతోనూ సత్సంబంధాలు కలిగిన నాయకుడిగా కిషోర్ నాయుడు కు మంచి గుర్తింపు ఉంది. సందర్భంగా నూతన గృహ ప్రవేశానికి వచ్చిన కిషోర్ నాయుడు ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు యువనేత లోకేష్, నారా భువనేశ్వరమ్మలు ఏమయ్యా కిషోర్ ఎలా ఉన్నావు... నీవు పడుతున్న కష్టానికి త్వరలోనే సముచిత స్థానం లభిస్తుందని ఆప్యాయంగా పలకరించడం పట్ల ఆయన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. చిట్టమూరు తెలుగు తమ్ముళ్ల సైతం కిషోర్ నాయుడు కు నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశ భావాన్ని వ్యక్తం చేస్తున్నరు. కిషోర్ నాయుడు మాట్లాడుతూ నన్ను ఆప్యాయంగా పలకరించి తన వాడుగా భావించిన ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## వాకాడులో భారీ వర్షం

వాకాడు, మే 25 ప్రభాతవార్త: వాకాడులో ఆదివారం సాయంత్రం నుండి కొద్దిపాటి వర్షం మొదలై భారీ వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సుమారు మూడు గంటలపాటు వర్షం పడడంతో రైతులకు సాగునీరుతో పాటు, గ్రామాలలో త్రాగునీరు కు కూడా వర్షపు జలాలులో తోడ్పడ్డాయి, పలుచోట్ల కొద్దిపాటి మెరుపులు, అక్కడక్కడ ఉరుములు వచ్చాయి, నైరుతి రుతుపవనాలు ప్రభావం ఉండవచ్చును. ఈ సీజన్లో రైతులకు ఈ వర్షాధారణ ఎంతో ఉపయోగకరం. అయితే గ్రామాలలో డ్రైనేజీ ప్రాబ్లం ఎంతో ఉంటుందని దోమల బెడద ఎక్కువగా ఉంటుందని సంబంధించిన వైద్య అధికారులు, పంచాయతీ పాలకులు, ఉన్నత అధికారులు గ్రామాలలో డ్రైనేజీలలో శానిటేషన్ కార్యక్రమం చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఈ వర్షాపువలన అంటువ్యాధులు సంబంధించిన మలేరియా, డెంగ్యూ పలు వైద్య సంబంధించిన వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాల్సిన సంబంధించిన అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

## నాయుడుపేటలో వర్షం!

నాయుడుపేట మే 25 ప్రభాతవార్త ; నాయుడుపేట పట్టణం, మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో గతవారం రోజులనుండి అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. ఉదయం నుండి భానుడు భగభగ మంటూ మండుతూ ఉండగా సాయంత్ర సమయంలో ఒక్కసరిగా ఆకాశంలో నల్లటికారుమబ్బులు కమ్ముకొని ఈదుగాలిలు, ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఎండతీవ్రత నుండి కొంతవరకు ఉపశమనం పొందారు.అయితే మామిడి తోటలు సాగుచేపడుతున్న రైతులు ఈవర్షాలకు నష్టజరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈవర్షాలు ఎడగారుసాగు చేపడుతున్న రైతులకు ఊరటనిస్తుంది. కురుస్తున్న వర్షాలకు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఆకట్టుకున్న అర్జున తపస్మాను ఘట్టం



సోమల, మే 25, ప్రభాతవార్త

నంజంపేట, 81 చిన్న ఉప్పరపల్లి, పొదలకుంటపల్లి పంచాయతీలు సంబం ధించిన మహాభారత యజ్ఞం గత వారం రోజులుగా జరుగుతోంది. నంజంపేట గాగ్గే నది ఒడ్డున గీతా శ్రమం సమీపంలో మహా భారతం జరుగుతుంది. ఆదివారం సాయం త్రం అర్జున తపస్మాన్ గద్దం వైభవంగా జరిగింది. అర్జున వేషధారి పాడిన పద్యాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి వందలాదిమంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

## పంట నష్టపోయిన రైతులకు పరామర్శ



సదుం, మే 25, ప్రభాతవార్త

సదుం మండలం చెరుకువారిపల్లి పంచాయతీ గత నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. దీనితో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంటలు నష్టపోయిన రైతులను జనసేన పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించారు. నియోజకవర్గం ఇంచార్జ్ చిన్నా రాయల్, నియోజకవర్గ నాయకులు కోలా సోమశేఖర్ల ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు నాగ తేజ జనసేన నాయకులు కలసి రైతులను పరామర్శించారు. నష్టం జరిగిన పంటకు నష్టపరిహారం చెల్లించే ప్రక్రియలో భాగంగా అటవీ అధికారులతో మాట్లాడి నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జక్కల శ్రీకాంత్, పవన్, రాకేష్, శివ, రెడ్డి శేఖర్, సాయికుమార్, సాయి సుమంత్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై స్పందించిన దేవస్థానం



శ్రీకాళహస్తి,మే 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయం అక్రమకట్టడాలపై దృష్టి సారించారు. శ్రీకాళహస్తీశ్వరాల యానికి దక్షిణాన గొడ్డెరు కాలువ ఉంది.ఈ కాలువలోకి వర్షపు నీరుతో పాటు దేవస్థానం అన్నదానం,పరిపాలనా భవనాలు, అతిథిగృహాలు, పోటు, ఆలయంలోని ఇతర ప్రాంతాల్లో కురిసిన వాన నీరు కలుస్తుంది.ఇందుకు ప్రత్యేక కాలువ ఉంది.దానిని గొడ్డెరులో కలిపి ఉన్నారు. ఈ గొడ్డెరు దశల వారిగా ఆక్రమణలకు గురౌతూ వస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం కాలువ మధ్యలో ఓ యువకుడు నిర్మాణాలు చేపడు తుండగా దేవస్థానం ఇఓ డి.బాపిరెడ్డికి పిర్యాదు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లోని కట్టడాలపై అధ్యాయనం చేస్తున్న ఇఓ వెంటనే తన సిబ్బందికి అక్రమకట్టడాల తొలగింపుకు ఆదేశించారు. దాంతో ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, సిఎస్ఓ నాగభూషణం యాదవ్,వర్క్ ఇన్సె పెక్టర్ ప్రతాప్, అసిస్టెంట్ సిఎస్ఓ సుదర్శన్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆక్రమణదారుడు తనకున్న భవనాన్ని వెనక్కు కాలులోకి చొరబడి పిల్లర్లు వేస్తున్నట్లు గుర్తించారు. ఆ కట్టడాన్ని ఆపివేసారు. వెంటనే తొలగించుకోవాలని ఆదేశించారు.

**కాలువ పొడవునా స్పందిస్తే బాగుంటుంది:**

శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓ డి.బాపిరెడ్డి సన్నిధివీధిని సుందరీకరణకు నిర్ణయించారు. ఈ మేరకు మహాశివరాత్రికి ముందు శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాలతో రోడ్లను వెడల్పు చేసారు. అలాగే భవిష్య త్తులో మాస్టర్ ప్లాన్ అమలుకు సంబంధింది వేదికను సిద్దం చేసుకుంటున్నారు. దాంతో గొడ్డెరుతో వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని గుర్తించారు. అంతేకాక గొడ్డెరులో ఆక్రమణలు ఆయన దృష్టికి వచ్చింది. అయితే ఆ సమస్యను పరిష్కరించాల్సింది రెవెన్యూశాఖ కాబట్టి మౌనం వహించి ఉన్నారు. ఆదివారం గొడ్డెరులో కట్టడాన్ని నిలువరించటంతో ప్రజలు మొదటి నుంచి సర్వే జరిపి కాపాడితే బాటుంటుందని అభిప్రాయపడుతున్నారు.

## గణనాధుని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు



కాణిపాకం, మే 25 ప్రభాతవార్త: ఏపీ, కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం కుటుంబసమేతంగా కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఈమేరకు ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తోట దన చంద్రశేఖర్, కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యీయమూర్తి జస్టిస్ కామేశ్వరరావులు వేర్వేరుగా కుటుంబసమేతంగా కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడులతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాంబయ్యపాలెంలో జాతరలో ఎంఎల్ఏ



తొట్టంబేడు, మే 25 ప్రభాతవార్త

మండలంలోని సాంబ య్యాపాళెం గ్రామంలో నిర్వహించిన గ్రామదేవత చెల్లమ్మ కొలుపు జాతర సందర్బంగా శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి విచ్చేశారు. ఈసందర్బంగా ఆయనకు మహిళా తెలుగుదేశంపార్టీ నాయకురాలు మునిరాజమ్మ (చిట్టెమ్మ), మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు రావిళ్ళమునిరాజ నాయుడు, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ రంగినేనిచెంచయ్యనాయుడు, మాజీ జడ్పీటిసి వెంకటాచలం, తదితరులు హజరయ్యారు. ఒవైపు జోరున వర్షం కురుస్తున్నా ఎంఎల్ఏ సాంబయ్యపాళెంకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్బంగా ఆలయం వద్ద అమ్మవారి ముగ్గును పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, తెలుగుదేశంపార్టీ నాయకులు హజరయ్యారు.

## వరసిద్దుని సేవలో టీటీడీ చైర్మన్



కాణిపాకం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు( బిఆర్.నాయుడు) ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా గన్నవరం ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ యార్లగడ్డ వెంకట్రావ్ కుటుంబసమేతంగా కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి. స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

## సిఎం చంద్రబాబును కలసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



కుప్పం, మే 25 ప్రభాతవార్త : కుప్పంలో సొంతింటి గృహ ప్రవేశ కార్యక్రమంకు హాజరైన సిఎం చంద్రబాబునాయుడును జిల్లాలోని ప్రభుత్వ విప్‌లు, శాసనసభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ విప్‌లు కంచర్ల శ్రీకాంత్, థామస్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు,నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, చుడా ఛైర్మన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, కార్పోరేషన్ ఛైర్మన్ శ్రీదేవి,మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు తదితరులు కలిశారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబుకు గృహ ప్రవేశం సందర్భంగా జ్ఞాపికలు, దేవతామూర్తుల చిత్రపటాలను బహుకరించారు.

## అభివృద్ధి.. పార్టీ వ్యవహారాలపై సిఎం చంద్రబాబు సమీక్ష



కుప్పం, మే 25 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, తెలుగుదేశం పార్టీ వ్యవహారాలపై సిఎం చంద్ర బాబునాయుడు ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి దాకా సమీక్ష నిర్వహించారు. తమ నూతన గృహంలోనే ఈసమీక్ష సమావేశాలను నిర్వహించారు. ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత బిఆర్ సురేష్‌బాబులతో సహ కడ సలహా మండలితో తొలుత సమావేశమయ్యారు. కుప్పం మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన, చేపట్టబోవు అభివృద్ధి కార్యక్రమాలపై సిఎం వారితో చర్చించినట్లు సమాచారం. అనంతరం నియోజకవర్గ స్థాయిలో తెదేపా సమన్వయ కమిటీ, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమై పార్టీ వ్యవహారాలపై చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులను ఆదేశించారని సమాచార ం. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకుసాగాలని సూచించినట్లు తెలిసింది.